

# గజ ఈతరాలు

గొరుసు జగదీశ్వరరెడ్డి

విమల టీచర్ నోటి నుండి వచ్చిన ఆ మాటకు నే తింటున్న జాంగ్రీ ఒక్కసారిగా చేదనిపించింది. షాక్ తగిలినట్లు నమలటం ఆపేసి ఆమెకేసి చూసేను.

‘‘నేను కూడా మొదట్లో నమ్మలేదు. మొన్న దసరాకి వనపర్తికి వెళ్లాను. మా ఇంటి దగ్గరుండే గొల్ల నీలమ్మ నీకు తెలుసుకదా, మాకు పాలు పోసేది, తను చెప్పింది. పూర్ణమ్మ కొంతకాలం కొడుకు దగ్గర వుందట. ఆ తర్వాత పట్నంలో వుండలేక తన ఇంటికి వచ్చేసి, ఆ వచ్చిన రెండోనాడే కర్ణమొళ్ల బావిలో దూకిందట,’’ విమల టీచర్ చెప్పుకు పోతోంది.

‘పూర్ణమ్మ చనిపోయింది,’ అదొక్కటే చెవుల్లో ప్రతి ధ్వనిస్తున్నట్లుంది. తెలిసిన వారి పెళ్లిలో భోజనాల దగ్గర అనుకోకుండా కన్పించింది టీచర్. నా చిన్నతనంలో మా పక్క వీధిలో వుండేది. నా బాల్యం అంతా వనపర్తిలోనే గడిచింది. ఇరవై అయిదేళ్లుగా ఆ ఊరితో సంబంధం తెగిపోయినా, మనసులో ఆనాటి స్మృతుల తడి ఇంకా ఆరలేదు.

టీచర్ ‘వెళ్లొస్తానని’ చెప్పి వెళ్లిపోయింది. ఆవిడ నా చెవిలో వేసి వెళ్లిన ‘పూర్ణమ్మ ఆత్మహత్య’ని జీర్ణించుకోలేకపోతున్నాను.

పూర్ణమ్మ బావిలో దూకిందంటే... ఆమెను బాగా తెలిసిన వారు విస్మయంతో చెప్పిన వారివైపు వెర్రిగా చూస్తారనిపించింది. ఎందుకంటే ఆమె గజ ఈతగత్తె. చిన్నతనంలో నాలాంటి వందమందికి ఈత నేర్పింది. ఈదటం సరిగారాక నీటిలో గల్లంతు కాబోతున్న పిల్లల్ని గమనించి మెరుపులా దూకి, ఒడ్డుకు తెచ్చేది.

ఏటికి ఎదురీదే మనస్తత్వం, జీవితాన్ని మొండి ధైర్యంతో ఎదుర్కోగలదు.

అలాంటి పూర్ణమ్మ ఈ ముసలి వయసులో ఆత్మహత్య చేసుకోటం? అది నిజమైనా నేనెట్లా నమ్మను!

ఆత్మహత్య చేసుకోవలసిన అగత్యం ఏమొచ్చింది? కొడుకు పట్నంలో ఏదో గవర్నమెంట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడని తెలుసు. వాడి బతుకువాడు బతికినా, ఏ కాయో, పండో అమ్ముకొని బతగ్గల నేర్పు వుంది తనకి.

ఆలోచిస్తున్నకొద్దీ గుండె బరువెక్కసాగింది. ఏదో బాధ మనసుని మెలిపెడుతోంది. కళ్లల్లో అప్రయత్నంగా ఉబికిన నీటికి చుట్టూ వున్న లైట్ల కాంతి అలుక్కుపోయినట్లు అన్పించి, కళ్లు తుడుచుకున్నాను. భోజనం సహించలేదు. ప్లేట్ని బేసిన్లో పడేసి చేయి కడుక్కున్నాను.

పెళ్లి వాతావరణం భరించలేకపోయాను. తెలిసిన మిత్రులు పలకరిస్తున్నా, ఎవర్నీ సరిగా రిసీవ్ చేసుకోలేక పోతున్నాను.

ఇంటికి వచ్చినా పూర్ణమ్మే కళ్ల ముందుంది.

ఆమె చుట్టూ గడిచిన బాల్యం మాటిమాటికీ గుర్తుకు వస్తోంది. వనపర్తికి వెళ్లాలని కోరిక కలుగుతోంది. పూర్ణమ్మ లేదు. అయినా అక్కడికి వెళ్లాలని బలంగా అనిపించింది. వెళ్లడానికే నిశ్చయించుకొన్నాను.

పాతికేళ్ల క్రితం మాట-

నేను తొలిసారిగా చూసిన పూర్ణమ్మ తన పదేళ్ల కొడుకుతో మాకు ఎదురింట్లో వుండేది. నాన్నకి మహబూబ్‌నగర్ నుండి వనపర్తికి బదిలీ అయ్యింది. కానిస్టేబుల్‌గా పనిచేసేవాడు. మాకున్న ఆర్థిక ఇబ్బందుల రీత్యా తను అద్దెకు తీసుకున్న ఇల్లు ఒక మూలగా, పొలాలకు దగ్గరగా వున్న రాయగడ్డ వీధిలో వుండేది. అక్కడ ఇంటి అద్దెలు తక్కువ.

అప్పుడు నేను స్థానిక జిల్లా పరిషత్ స్కూల్‌లో ఏడవ తరగతి చదువుతున్నాను. ఆ వీధిలో ప్రతి ఒక్కరూ కూలీనాలీ చేసుకుని ఏరోజు కూలిడబ్బులు ఆరోజు తెచ్చుకొని ఆపూట గడుపుకునేవాళ్లు. అందరికీ చిన్న చిన్న మిద్దె ఇండ్లు, సవుడు మట్టితో కప్పబడి వుండేవి.

నాకు వాళ్లందరితో పరిచయం కల్గడానికి కొంత కాలం పట్టింది. అందరూ పరిచయం అయ్యాక వాళ్లల్లో ఒకడినైపోవడానికి ఎంతోకాలం పట్టలేదు.

మా ఇంటికి ఎదురుగా వుంటున్న పూర్ణమ్మ చామనచాయలో వుండి, సన్నగా, పొడుగ్గా వుండేది. తన కొడుకు రాజుతోపాటూ అప్పుడప్పుడూ ఇంటికి వచ్చి గడపముందు కూర్చుని అమ్మతో పిచ్చాపాటీ మాట్లాడేది.

తన గతం గురించి విప్పి చెప్పే నేపథ్యంలో... తనకున్న ఆస్తి కొడుకు తప్పించి మరేమీ లేదనేది. వాడు పుట్టిన ఆరునెలలకే భర్త పాలమూరు లేబర్‌గా బంతి కట్టిన కూలీలతో పాటూ బళ్లారి వైపు వెళ్లి, మరి తిరిగి రాలేదట. మొగుడి కోసం కొన్నాళ్లు ఎదురు చూసిందట. అతను అక్కడే ఎవర్తోనో కాపురం చేస్తున్నాడని వార్తలు విన్నమీదట, ఇక రాడని గట్టిగా నిర్ణయించుకొని ఆలోచించడం మానేసి కొడుకు కోసం బతుకుతున్నానని చెప్పేది.

పూర్ణమ్మ చేయని పనంటూ లేదు. కోతలకీ, నాట్లకీ, కలుపు తీయడానికీ, మేస్త్రీల దగ్గర మాల్ అందించడానికీ వెళ్లేది. సీజన్లలో వచ్చే సీతాఫలం, మామిడి, రేగు, జామ, సపోట, కర్బూజ, పుచ్చ లాంటి రకరకాల పండ్లు, ఉడికించిన చిలగడదుంపలు, శనగలు, అనుములు, అల్సందలు, ఉలవలు అమ్మేది. వీటన్నిటితో పాటూ తను నిత్యం చేసే పని అడవులకు వెళ్లి, కట్టెలు తెచ్చి ఊరంతా తిరిగి అమ్మటం.

నా ఈడు పిల్లలు చాలామంది నాతోపాటే బడికి వస్తూ, సెలవుల్లో వాళ్ల అమ్మా, నాన్నల వెంట కూలికి వెళ్లేవాళ్లు.

పూర్ణమ్మ కొడుకు తల్లితోపాటే అడవులకు వెళ్లేవాడు. నేనూ ఆదివారాల్లో, సెలవుల్లో వాళ్లందరితో కలిసి అడవులకి వెళ్తానని, కట్టెలు తెస్తానని అమ్మతో అన్నాను.

''నాన్నకి తెలిస్తే చీరేస్తాడని,'' బెదిరించింది మొదట్లో.

తర్వాత బుజ్జగింపుగా, 'రెడ్డి కులంలో పుట్టి అలాంటి పనులు చేయరాదని,' హితవు చేసింది. నేను మారాం మానలేదు.

వీళ్లందరితో తిరిగి చెడిపోతున్నానని తిట్టి, పిర్ర మీద రెండు తగలనిచ్చేది. నా గోల భరించడం కష్టమైపోయింది ఇంట్లో వాళ్లకి.

తర్వాత నా అల్లరికి తట్టుకోలేక, చివరికి పూర్ణమ్మ చొరవతో కొంత పట్టు సడలించారు. నాకు అడవులకి వెళ్లాలని వుందన్న విషయం రాజు తల్లితో చెప్పినట్లున్నాడు. ఏ కూరకో, పచ్చడికో వచ్చిన పూర్ణమ్మ అమ్మతో అనటం విన్నాను.

"రెడ్డమ్మా నీ కొడుకును మాతోన పంపు. సందెడు కట్టెలు దెచ్చిన గూడ రెండు దెసాలయితయ్. పిల్లల గ్గూడ గిప్పటిసందే కష్టం సంగతి దెల్వాలె. మా అన్న ఎంత కష్టంజేస్తడో నీకెర్కలేదా. పోలీసోల్ల పనంటే... సచ్చిన పీన్గెకాడ తిండి, తిప్పల్ మాని పంచెనామ అయ్యేదాంకా నిలవడాలె. మొగపిలగాడు కష్టంజేస్తే తప్పా... మా రాజుగాడు సాలెకు వోతలేడా, నా ఎంబడి అడువులల్లకు వొస్తలేడా, మావోనితోన జతగుంటడు తీయ్. గీ అయితారంనాడు తోల్కపోత.'' పూర్ణమ్మ భరోసా ఇవ్వటంతో కొంత ఒప్పుకున్నారు.

అలా మొదలయ్యింది వారందరితో సావాసం.

ఎండాకాలం వచ్చిందంటే మాకందరికీ పండగ.

బడి పీడ వుండదు. ఏ నాల్గుగంటలకో తెల్లవారక ముందే నిద్రలేచి, అడవులకు వెళ్లటం, మధ్యాహ్నం వరకంతా కట్టెల మోపులతో తిరిగి వచ్చేసి, అన్నాలు తినేసి, కర్ణమోళ్ల బావికి పరిగెత్తటం.

మొదట్లో ఈత సరిగారాక, బావి అంచుల్లో తచ్చాడేవాణ్ని, మాతోపాటూ మాసిన బట్టలు ఉతకడానికి వచ్చే పూర్ణమ్మ నన్ను గమనించి, నీటిలో తన రెండు చేతులు చాచి, నన్ను బోర్లా పడుకోమని చెప్పి, ఈదమనేది. నేను భయంతో, ఒకరకమైన దడతో కాళ్లాడిస్తే చేతులాడించక, చేతులాడిస్తే కాళ్లాడించక... రెండూ చేస్తే కంగారులో నీళ్లు మింగేయటం. ఇలా లాభం లేదని ఖాళీ కిరోసిన్ డబ్బాను తెచ్చి నా నడుంకు కట్టి ఈదమనేది. ఒక్కోసారి మునగబెండు కట్టేది.

వారం రోజుల్లోనే ఏ ఆధారం లేకుండా బావి మధ్యకు వెళ్లి ఈదుతుంటే ఈ ప్రపంచాన్ని జయించినంత గర్వంగా అన్పించేది.

పూర్ణమ్మ నాకు ఈతనేర్పిన గురువు.

పిల్లలందరం గోలగోలగా అరుస్తూ, దిసమొలల్తో బావిలో చేపపిల్లల్లా ఈదుతుంటే తృప్తిగా చూస్తూ, ఒడ్డునున్న బండరాయిపైన బట్టలకు సవుడు పులుముతూ మా ఆటల్ని గమనించేది.

''బాయి నడిమిట్లనే ఈదుండ్రి. గోడలంచుల పోంటి పోకుండ్రి. గోడ బొక్కలల్ల మూతి మూరెడు సాపు కొని నీరుగట్టలుంటయ్. ఎండ్రగచ్చులు మీ సెడ్డీలల్లకు వోయి కసుక్కున బెల్లలు గొరుకుతయ్,'' అనేది నవ్వుతూ.

కొంతసేపు వాళ్లమ్మ ఉతికిన బట్టల్ని బావిగట్టు చుట్టూ వున్న తంగేడు పొదలపై ఆరేసి రావటం, మరి కొంతసేపు మాతోపాటు ఈత ఆటలో పాల్గొనేవాడు రాజు.

పూర్ణమ్మ బట్టలన్నీ ఉతికేక గోచీ బిగించి, మోట దగ్గరున్న రాయికడీల పై నుండి కొర్రు కొడ్తూ, దడేల్ మని శబ్దం చేస్తూ, వాలుగా నీటిలోకి చొచ్చుకుపోయేది. తల్లి ఈదుతుంటే రాజు కేరింతలతో ఈలలేసేవాడు. మేమంతా రకరకాల భంగిమల్లో మోకాళ్లు మడిచి, వాటిపైన చేతులు రెండూ బిగించి ఉండలా చుట్టుకు పోతూ, బొంగరంలా గుండ్రంగా తిరుగుతూ... నీటిలో దూకేవాళ్లం.

నేను మాత్రం ముక్కు మూసుకొని దూకేవాడ్ని. ఎందుకంటే నీళ్లు మింగేస్తాననే భయం నాకు. పూర్ణమ్మలా బావి అడుక్కి వెళ్లి మట్టిని తెచ్చే సాహసం ఎవరం చేయలేకపోయేవాళ్లం. ఎక్కువసేపు నీటిలో వుంటే ఊపిరి సలిపేదికాదు. పూర్ణమ్మ నీటిపై తామ రాకులా చాలాసేపు సూర్యుడ్ని చూస్తూ తేలుతూ వుండేది.

పూర్ణమ్మ ఎన్ని కష్టాలు పడ్డాగానీ రాజు చదువు విషయంలో శ్రద్ధ వహించేది. అప్పుడప్పుడూ బడికి వెళ్లి టీచర్లతో కొడుకు చదువు గురించి ఆరా తీసేది. విమల టీచర్ వద్దకు ప్రైవేట్‌కు పంపేది. టీచర్ వాడి దగ్గర డబ్బులు తీసుకునేది కాదు.

''తండ్రి లేని బిడ్డ రెడ్డమ్మా. నేను ఎంత కష్టంల వున్నగానీ, నా పానం బోయినగానీ గీని సద్వు మాన్పియ్య. సదువుకుంటే గీ గాడ్ది కష్టం తప్తది. యా సర్కారు నౌకరన్న వస్తది. నాకు పెట్టకుంటె వాయె. వోని పెండ్లం పిల్లలనన్న సాక్కుంటడు,'' అమ్మతో మనసు లోని మాటల్ని విప్పి చెప్పేది.

పూర్ణమ్మ దిగులుగా వుండటం నేనేనాడు చూడ లేదు. నవ్విస్తూ పిల్లలందర్నీ పోగుచేసి అక్కున చేర్చు కునేది. వెన్నెల రాత్రుల్లలో... కళ్లకు గంతలు కట్టి దాగుడుమూతలు, వెన్నకుప్పలాటలు, ముక్కు గిల్లి పోయే ఆటలు, వత్తునా పోతునా ఓ రామచిలకాట, లోలో తిమ్మాప్పా, వానగుంతలాట, బారకట్టాట, పచ్చీ సాటలు ఆడించేది. ఇలాంటి ఆటలే కాకుండా పొడుపు కతలు వేసి, మమ్మల్ని విప్పమనేది. కాంభోజరాజు, బాలనాగమ్మ లాంటి పెద్ద పెద్ద రాజుల కథలు, భయ పెట్టే దయ్యాల కథలు చెప్పేది.

ఆమె తోడుంటే ఆకలి మరిచేవాళ్లం.

పిల్లలందర్నీ గుంపుగా వాకిట్లో కూర్చోబెట్టి, వీధిలో వున్న మిగతా ఆడవారితో కలిసి చప్పట్లు చరుస్తూ, మా చుట్టూ తిరుగుతూ-

*భోగం దాని బొడ్డు సుట్టె ఎన్నియల్లో*
*సామిరెడ్డి పాపికండ్లు ఎన్నియల్లో*

లయబద్ధంగా సాగే అలాంటి బొడ్డెమ్మ పాటలు తనకెన్నోవచ్చు.

ఒక్కోసారి పూర్ణమ్మ వెంట పొలాల్లోకి వెళ్లి పచ్చి పేడను, ఎండిన పిడకల్ని గంపలకు నింపుకొచ్చేవాళ్లం. వడ్లమిల్లు నుండి వరిపొట్టు, వేరుశనగల మిల్లు నుండి పల్లిపొట్టు తెచ్చేక, పచ్చి పిడకలకు అద్దేవాళ్లం.

అప్పుడు ప్రతి ఇంట్లో వంట చెరుకుగా కట్టెల్ని, పిడకల్ని, బొగ్గుల్ని వాడేవారు. ఎక్కడో తప్పించి కిరోసిన్ స్టౌలు వుండేవి కావు.

మొదట్లో అడవులకి, పేడకీ వెళ్లొద్దని చెప్పిన అమ్మే తెచ్చిన కట్టెలతో, పిడకలతో వంట చేసేది. బయ ట్నుండి కట్టెలు కొనడం పూర్తిగా మానేశారు.

ఆర్థికస్థితి గతులు తప్పితే రేవీకీ, దర్పానికి ప్రతీక లైన భుజంపైని కండువాలే గోచీగుడ్డలుగా రూపాం తరం చెందుతాయనిపించింది.

నేను తొమ్మిదవ తరగతి పరీక్షలు రాసేక ఓ వేసవి రోజున పూర్ణమ్మ సాహసానికి సంబంధించిన ఓ సంఘ టన జరిగింది. ఇప్పటికీ అది నా కళ్లల్లో మెదులుతూ వుంటుంది.

ఎప్పట్లాగే తెల్లవారి నాలుగు గంటలకు నిద్ర లేచి, అడవులకు వెళ్లడానికి సందడి మొదలయ్యింది ఆవేళ.

తొలికోడి కూతకు ఎవరో ఒకరు నిద్రలేచి, ఆ ముందురోజు అనుకున్న ప్రకారం అడవికి ఎవరెవరు వస్తారో, వారి ఇంటి తలుపు తట్టాలి.

అందరం హడావుడిగా ఏ బొగ్గు ముక్కనో దొరక బుచ్చుకొని, కరకర నమిలి, బరబర పళ్లు తోమి, మొహాలు కడిగేసుకొని రాత్రి వుంచుకున్న అన్నమో, జొన్నరొట్టెలో సద్ది గట్టుకొని, తాళ్లు, గంపలు, గొడ్డళ్లు తీసుకొని బయల్దేరేవాళ్లం. అన్నిట్లో గొడ్డల్ని ఖరీదయి నదిగా భావించేవాళ్లు.

ఊరంతా నిద్రలో జోగుతుంటే, మేం వీధుల వెంట గబగబ నడుస్తూ, బస్టాండు మీదుగా కర్నూలు వైపు వెళ్లే తారురోడ్డు పైకి వచ్చి, మూడు, నాలుగు కిలో మీటర్ల దూరంలో వున్న అడవుల వైపు దారి మళ్లేవాళ్లం.

పిల్లలు ఇద్దరు ముగ్గురుంటే మిగతా ఆడ, మగ మరో పదిమంది పైగా వుండేవారు.

అమావాస్య ముందు రోజులనుకుంటాను. తూర్పుకి కొద్ది ఎగువన కొడవలి ఆకారంలోని చంద్రుడు ఎర్రగా, గుడ్డిగా ఉన్నాడు. వేగుచుక్క ఇంకా పొడవ లేదు. దారి పొడుగునా రాత్రి చూసిన ఏ సినిమా కథ గురించో, అత్తాకోడళ్ల తగువుల గురించో, మొగుడి ప్రవర్తన గురించో సంభాషణలు సాగేవి.

కబుర్లు లేకపోతే పాటల్ని పాడుకుంటూ అడుగులు వేసేవారు. పూర్ణమ్మ గొంతులోని పాట చాలా మధురంగా అన్పించేది.

రాజు, నేను స్కూల్ విశేషాలు చెప్పుకుంటూ నడుస్తున్నాం. సాయమ్మా, బాలమణి, బందెమ్మా, రంగమ్మా, రాములన్న, కూర్మన్నా మరికొందరు జట్లు జట్లుగా వున్నారు.

మేమంతా కొత్తబావి దాటి, మర్రికుంట వైపు నడుస్తున్నాం. సాయమ్మ తన ఇంటి గోడును విన్పి స్తోంది.

''పూర్ణత్తా, వోన్నోట్ల మన్నువడ, నాతిరి నా సెంప జవిరిండు గదనే. గందుకనే ఏటవుతలకి పిల్లనీయొద్దని మా అమ్మ ఎంతగానం జెప్పిన, దూరపోళ్లంటని మా మేనత్త నా సవితి నను గీవూరికిచ్చేదాంక మా నాయనను సతాయించి సంపె. మబ్బుల బువ్వ వండిన, గదంత పెద్ద తబుకుల బోర్లిచ్చి, నా అత్తలంజెకు, నా ఆడబిడ్డ దుడకకు, నా మొగనికి, నాకు సెరసమంగ బొడ్డేలు వెట్టినత్తా. నా ఆడిబిడ్డకు సిన్న సగంబెట్టి, నేను పెద్ద సగం తిన్ననంట. మా అత్త రాంగానే అంటిచ్చె. నా మొగనికి ఉన్నయి, లేనియి అన్నిజెప్పిరి తల్లిబిడ్డలు. నీళ్లువోసుకున్నదాన్ని ఒక ముద్ద ఎక్వదింటె ఏమయిత దంటని నా మొగుడనకపాయెనమ్మా...''

''నీ అత్త సంగతి దెల్వందేమున్నదే సాయమ్మా, మీ మామున్నంగ దినాం జూస్తలేకుంటిమా, దీని లొల్లికి బుగులు వడే సచ్చె మారాజు,'' ప్రక్కనే నడుస్తున్న బందెమ్మ మాట కలిపింది.

'ఏటవుతల' అంటే కృష్ణానదికి అవతల వున్న గద్వాల దగ్గరున్న పల్లె సాయమ్మది. మా కబుర్లలోనే మర్రికుంట దాటి, నీలగిరి చెట్ల మలుపు తిరుగు తుండగా మాకు ఎదురయ్యాయి ఎడ్ల బండ్లు.

ఆ గుడ్డి వెలుతుర్లో, మెడలో గంటలాడిస్తూ, పెబ్బేరు, రంగాపురం బీచుపల్లిల దగ్గర వున్న కృష్ణ ఇసక పర్రెలపైన పండించిన కర్బూజాల్ని, పుచ్చకాయల్ని మోసుకొస్తు న్నాయి ఎద్దులు. వనపర్తిలో జరిగే సంతకు అక్కడ్నుండే గాక, కర్నూలు తుంగభద్ర ఒడ్డున పండించి నవి కూడా వస్తుంటాయి.

మొత్తం పద్నాల్గు బండ్లు. చివరి బండి మమ్మల్ని దాటుకొని వెళ్లింది. బాలమణికి దొంగ బుద్దెక్కువ. పూర్ణమ్మ ఎంత వారిస్తున్నా వినకుండా చివరి బండి వెనకగా వంగి వంగి నడుస్తూ వెళ్లింది.

కొద్దిసేపటికి వెనక నుండి, ''సస్తినే... చెయ్యి డువురో'' అంటూ పెద్ద కేకలు విన్పించేసరికి పూర్ణమ్మ పరిగెత్తింది. నేను, రాజు అనుసరించాం.

బండివాడు బాలమణి రెక్కపుచ్చుకొని తిట్టడం మొదలెట్టాడు.

''లంజెదానా, నీ మిండెడు పండించిన పండ్లను కున్నవా, దొంగతనం జేయనీకె బుద్దెట్ల పుట్టిందే. నోటికి అన్నం తింటవా, పీదింటవా...'' విషయం అర్థమ య్యింది. వాడు ముందు వెళ్తున్న బండ్లవాళ్లను పిలవ బోతున్నాడు. పూర్ణమ్మ గబగబ బాలమణి రెక్క పట్టి ఇవతలికి విసురుగా లాగేసరికి బండివాడు పట్టుదప్పి వెనక్కి విరుచుకుపడ్డాడు.

వెనక్కి తిరిగి చూడకుండా పరిగెత్తుకొచ్చాం అందరం. వద్దంటే వెళ్లిందని పూర్ణమ్మ మళ్లీ బాలమణిని తిట్టడం మొదలెట్టింది.

''నున్నగుంటె కళింగర కాయనుకున్న పూర్ణక్కా. గది బోడిగుండమ్మా! నేను గుంజింది వోని పిల్క వట్కోనే... నొప్పయిందేమో, సాడుదొంగ నా రెక్క వట్టిండు...''

బాలమణి చెబుతుంటే అందరం పడీపడీ నవ్వడం మొదలుపెట్టి, గండం గడిచిందని ఊపిరి పీల్చుకున్నాం.

వేగుచుక్క కాంతికి రోడ్డు స్పష్టంగా వుండి, లారీల కింద నలిగిన కప్పలు, పాములు అక్కడక్కడ కన్పిస్తున్నాయి. మేం తారురోడ్డు వదిలి, ఎడం వైపున్న కాలిబాటకి దారితీశాం.

చుట్టూ రాసులు పోసినట్లున్న గుట్టలన్నీ, గుబురైన చెట్లతో ప్రశాంతంగా వున్నాయి. తెచ్చిన సద్దిని తినే వాగు దగ్గర కూర్చున్నాం. తిన్న తర్వాత ఆ వాగులో ఎవరికి వాళ్లం దోసిళ్లతో ఇసకని తీసి, చెలిమలుగా చేసుకొని, తేటనీరు వచ్చేదాక ఆగి, మోకాళ్లతో వంగి, పెదాలుతో నీటిని పీల్చుకు తాగేవాళ్లం.

వెంట తెచ్చిన నారల్ని, తవిసెకట్లనీ కొద్దిసేపు నీటిలో నాన్చి, భుజాలపై వేసుకొని మళ్లీ బయల్దేరాం.

ఆ తెల్లవారుజామున కన్పించే అడవి అందాలు నాకు బాగా నచ్చేవి. రకరకాల పిట్టల అరుపులు, పేర్లు తెలియని ఎన్నో అందమైన కీటకాలు గాలిలో గిరికీలు కొట్టుండేవి. మా కాళ్లకు అడ్డంగా పరిగెత్తే కుందేళ్లు, పొదల్లో నుండి ఒక్కసారిగా నిశ్శబ్దాన్ని భంగం చేస్తూ 'బుర్రు' మంటూ ఎగిరే బురక పిట్టలు...

అందరం గుంపుగా వెళ్లి, దట్టమైన అడవి ప్రారంభం కాగానే, ముందుగానే తావు ఎక్కడో నిర్ణయించుకొని జట్లుజట్లుగా చీలిపోయేవాళ్లం.

ఆరోజు కొచ్చగుట్టమూలను తావు అనుకున్నాం. అందరం కట్టెలు ఏరుకొని, తావు దగ్గరకు వచ్చి మోపుల్ని కట్టుకోవటం జరిగేది. అడవిలో వున్న తావులకు కొన్ని పేర్లు పెట్టేవాళ్లం.

గతంలో ఎప్పుడో ఎవడో ఫారెస్ట్ ఆఫీసర్ కట్టెలకు వచ్చిన అమ్మాయిని మానభంగం చేసి చంపేశాడనీ, ఆమె దెయ్యమయి తిరుగుతుంటుందని, ఆ తావు పేరు చెప్పి, అటు వెళ్లొద్దనేవాళ్లు.

నేను, రాజు, పూర్ణమ్మ ఒక జట్టుగా విడిపోయాం. ఎక్కువగా ఎండిపోయిన చెట్లనే గొడ్డలితో నరికేది పూర్ణమ్మ. ప్రతి చెట్టు పేరూ చెబుతూ చూపించేది. తవిసె, బిట్లి, మంగ, యాప, తుగ్లి, ఊడుగ, పలువరి, గూదగుమ్మడి... ఇలా రకాలుండేవి. అందులో తుగ్లి చెట్లకు పచ్చిగానే మండే గుణం వుండేది.

"మా సిన్నగున్నంగ ఎలగొడ్లు మస్తుగుంటుండె. ఆడోళ్లు గనవడ్తె ఎంబడి పడేటివి. మేం కట్టెలకు గింత దూరం వస్తుంటిమా... కొత్తబాయి దాంక వచ్చెటాలకు మస్తుకట్టెలు. గీ దెసవత్తల కట్టెలు గాదు. అన్ని టేకువే దొరుకుతుండె..." తన బాల్యంలో వాళ్ల అమ్మతో పాటూ అడవుల్లోకి కట్టెలకు వచ్చిన ముచ్చట్లు చెప్పేది.

అక్కడక్కడ బెరడు తీసిన తంగేడు చెట్లు కన్పించేవి. తంగేడు బెరడుతో రంగులు చేస్తారని చెప్పేది.

అప్పుడప్పుడు నక్కలు, అడవి కుక్కలు కన్పిస్తే, మేం చేసే చప్పుళ్లకి పారిపోయేవి.

అందరం కట్టెలు ఏరుకొని, మా తావుకు వెళ్లబోయే ముందు గట్టిగా మిగతావారి పేర్లను ఉచ్ఛరిస్తూ అరిచేవాళ్లం. మా అరుపుల్ని మాకు తిరిగి అప్పగిస్తూ అడివంత ప్రతిధ్వనించేది.

రాజు, నేను పక్షుల కూతల్ని అనుకరిస్తూ గట్టిగా అరిచేవాళ్లం.

మేం తావుకు చేరుకునేసరికి మిగతావాళ్లు ఒక్కొక్కరే వస్తున్నారు. అందరూ నేలపైన గజం గజం దూరంలో తాళ్లు, కట్లు పర్చి ముందుగా లావుపాటివి ఏరి తర్వాత సన్నవి పేరుస్తూ మోపుల్ని కట్టారు.

చెక్క వచ్చి చెంప దగిలే నా సామి
సెప్పరానీ దుక్కమొచ్చే నా సామి

బాలమణి కూనిరాగం తీస్తూ మోపు కడుతోంది. మళ్లీ అందరం ఉదయం పుచ్చకాయల బండివాని పిలక లాగిన విషయాన్ని గుర్తుకు తెచ్చుకొని నవ్వుకొన్నాం.

కట్టెల మోపులు కట్టడంలో కూడా బాలమణి తన తెలివి ప్రదర్శించేది. తక్కువ కట్టెలు వాడి, ఎక్కువ కట్టెలున్న మోపులా తయారుచేసేది. ఆ మాట ఈ మాట చెప్పుకుంటూ అందరం మోపుల్ని తలపైకి ఎత్తుకొని గుట్ట దిగడం ప్రారంభించాము.

కాళ్ల కింద సన్నటి గులకరాళ్లు, ఏమాత్రం అజాగ్రత్తగా నడిచినా మోపుతో పాటూ సర్రున జారుతూ పడిపోతాం.

ముందు పూర్ణమ్మ తర్వాత నేను, రాజు, బాలమణీ ఆ వరసలో అందరం వెళ్తున్నాం. గుట్ట దిగి పల్లంలోకి వస్తూనే అక్కడున్న చెరువు దగ్గర మోపుల్ని దింపి, నీటితో మొహం కడుక్కొని, కొంత సేదతీరి, మళ్లీ బయల్దేరేవాళ్లం.

చెరువు పక్క నుండి వెళితే మళ్లీ తారురోడ్డుకి వెళ్తాం.

ఆరోజు మోపుల్ని దించుకొని చెరువులోకి దిగిన పూర్ణమ్మ ఒడ్డుకు దగ్గరలో వున్న తెల్ల కలువల్ని, నీలి కలువల్ని, ఎర్ర తామరల్ని తెచ్చింది.

కలువల కాడల్ని సగం సగం తుంచుతూ మాలగా చేసి మెడలో వేసుకునేవాళ్లం.

"వచ్చెనే... చవుకిదారు..."

మళ్లీ మోపుల్ని ఎత్తుకోబోతుండగా బాలమణి ఒక్కసారి అరుస్తూ, మోపుతోపాటూ మళ్లీ గుట్టవైపు పరిగెత్తసాగింది.

అందరిలో హఠాత్తుగా చలనం ప్రారంభమయ్యింది.

ఆ చౌకీదారు ఎవడో, వాడికి ఎందుకు భయపడి పారిపోతున్నారో అర్థం అయ్యేది కాదప్పుడు. పూర్ణమ్మ గబగబ మోపుల్ని రాజుకు, నాకు తలలపైకి ఎత్తి, తనూ ఎత్తుకొని చెరువు గట్టు వెంట పరిగెత్తసాగింది.

ఏదో జరగరానిది జరగబోతుందన్న భయం... కాళ్లల్లో వణుకుతో గబగబ అడుగులు వేస్తున్నాం.

మిగతా వారంతా దారి తెలియకుండా పరిగెడుతున్నారు. అప్పుడు చూసాను చౌకీదారుని. మాకు కొద్దిదూరంలో మోటార్‌సైకిల్ ఆపి, పొడగాటి రూలుకర్రతో మావైపు వస్తున్నాడు. వాడి ఒంటిపైన కాకీ బట్టలున్నాయి. మా పరుగులకి వాడూ మా వెంటబడ్తూ అరవటం మొదలెట్టాడు.

''బద్మాష్ ముండల్లారా ఆగండి. ఫారెస్టంతా నాశనం చేస్తున్నారు. మీ అమ్మ మిండెలదనుకున్నారాగీ అడివి... నిలవడ్తరా, లేదా...'' చేతిలోని కర్ర ఊపుతూ అందర్నీ వదిలి మా వెనుక పడ్డాడు.

''దబదబ నడువురా రాజుగా, దొంగనావట్ట గొడ్డలి గుంజుకుంటడు...'' పూర్ణమ్మ మెరుపులా దూసుకుపోతోంది. ఆమెను అందుకోలేక ఒక పక్క మేమిద్దరం ఏడ్వడం మొదలుపెట్టాం.

కాళ్లకింద పల్లేరు ముళ్లు కసకస దిగబడుతున్నాయి. ఇంకా తారురోడ్డు చేరుకోవడానికి కిలోమీటరు వెళ్లాలి. దూరం నుండే గమనించింది పూర్ణమ్మ. రోడ్డు పైన రెండు జీపులు, వాటిలో వున్న ఫారెస్టాఫీసర్లని. వెనక వీడు పరిగెత్తుకొస్తున్నాడు. ముందుకెళితే వాళ్లు వదలరు.

పూర్ణమ్మ క్షణాల్లో ఆలోచించి మోపుని విసిరేసి నిల్చుంది. మేమిద్దరం ఆమెను చేరుకోగానే మా తలలపై ఉన్న మోపుల్ని కింద పడేసింది.

''రాజుగా ఎనిక్కొల్లి గా బాడుకవుగాడు వస్తుండు. మనం ముందలి రోడ్డుమీదికి పోయినమంటె... సూసినవా జీపులల్ల సవుకిదార్లు... మీరిద్దరు భయం లేకుండా చెరువులకు దిగుండ్రి. గొడ్డలి గుంజుకున్నడంటె మల్ల మనం కొనలేం. పావుగంట ఈదినమంటే నీలిగిరి చెట్లు కాడ దేల్తం. ఆడికెల్లి మర్రికుంటకెల్లి నడుసుకుంట పోదం...''

చౌకిదారు మమ్మల్ని సమీపించేలోగా మేం ముగ్గురం చెరువులోకి దిగిపోయాం. పూర్ణమ్మకు చెరొక పక్కన పిల్లలమిద్దరం ఈదుతూ వెళ్తున్నాం.

మాకు ఆయాసం వచ్చినపుడు తన రెండు చేతుల్ని ముందుకు చాచి, ఆమె తన భుజాల్ని మా చేతుల్తో పట్టుకోమనేది. ఒడ్డు పై నుండి చౌకిదారు పచ్చి బూతులు తిడుతూ దొరికిన రాళ్లతో మావైపు విసుర్తున్నాడు. వాటిని తప్పించుకుంటూ మరో పావుగంటలో నీలగిరి చెట్ల ఒడ్డుకు చేరుకున్నాం.

ఆ చెట్ల నీడల్లో సేదతీరి, ఆయాసం తగ్గాక ఇంటి ముఖం పట్టాం. అప్పటికి మా బట్టలు ఆరిపోయాయి.

ఆరోజు పూర్ణమ్మ అలా సాహసంతో చెరువులోకి దూకకపోతే...ఆ చౌకిదార్లతో తన్నులు తప్పేవి కాదనిపించింది.

ఈ విషయాన్ని ఇంట్లోవాళ్లకి చెప్పలేదు.

తర్వాత కొన్నాళ్లు పిల్లలం అడవులకు వెళ్లటం మానేశాము. చౌకీదార్ల నిఘాలేని వైపున్న అడవులకి వెళ్లటం మొదలుపెట్టింది పూర్ణమ్మ.

నేను పదవతరగతిలోకి వచ్చేక అడవులకి వెళ్లటం తగ్గించాను. పూర్ణమ్మ కూడా కట్టెలమ్మటం మాని, పూర్తిగా పండ్ల వ్యాపారంలోకి దిగింది.

నేను పదవ తరగతికి పరీక్షలు రాస్తున్నప్పుడు నాన్నకి గద్వాలు దగ్గరున్న ఉప్పేరుకి బదిలీ అయ్యింది. మేమందరం వనపర్తిలో ఇల్లు ఖాళీ చేసి గద్వాలకు వచ్చాం. మేం వచ్చేటప్పుడు రాజు ఎనిమిది చదువుతున్నాడు.

మేం ఊరు వదిలేప్పుడు పూర్ణమ్మ కండ్ల నిండా నీరు తెచ్చుకొని, నన్ను దగ్గరగా తీసుకొని, ''కొడుకా గిన్ని రోజులు నా పిలగాని లెక్క మా ఓని జతనుంటివి. నా ఎంబడి అడవులల్ల తిరిగినవ్. పుట్టల్ల చెట్లల్ల తిర్గినవ్. బావుల్ల దూకి మా జతనీదినవ్. నా పెద్ద కొడుకువనుకున్న. రెడ్డమ్మా... యాడికోయిన మమ్ల మర్వకు తల్లీ...''

పూర్ణమ్మ అప్యాయతకు అమ్మ కూడా కళ్లు తుడుచుకుంది.

ఆ తర్వాత వనపర్తికి నేను వెళ్లిందే లేదు. కాలేజి చదువులకు దూరంగా వెళ్లటం అప్పుడప్పుడు ఇంటికి రావటం జరిగేది. ఎవరైనా వనపర్తి మిత్రులు కలిస్తే పూర్ణమ్మ విషయాల్ని అడిగి తెలుసుకునేవాడ్ని. రాజు ఐటిఐ చేసి, పట్నంలో ఏదో వాచీలు తయారుచేసే ప్రభుత్వరంగ సంస్థలో పని చేస్తున్నాడనీ... పూర్ణమ్మ అంతకు ముందులా వ్యాపారాలు చేయలేక అనారోగ్యంతో కొడుకు దగ్గరుంటుందని, రాజుకు పెళ్లి చేసిందని... ఇలా ఈ విషయాలు తెలిసేవి.

ఉద్యోగం, పెళ్లి, పిల్లలు, జీవితాన్ని ఒక చట్రంలో బిగించుకొని బతుకుతున్న కాలక్రమంలో విమల టీచర్ మళ్లీ బాల్యం గుర్తుకు తెచ్చే విషాదకరమైన సంఘటన చెప్పింది.

విమల టీచర్ కలిసిన రెండ్రోజుల తర్వాత వనపర్తికి వెళ్లాను. పాతికేళ్ల క్రితం ఊరికీ, ఇప్పటికీ తేడా కొట్టొచ్చినట్లు కన్పించింది.

వీధులన్నీ అలాగే వున్నా... నాకు అటు, ఇటుగా వున్న ఇండ్లన్నీ చిన్నగా కన్పించేయి. బహుశా నేనే పొడుగై

నందుకేమో! రాయిగడ్డ వీధిలో నన్నెవరూ గుర్తించే వీలులేదు. కానీ వాళ్లల్లో కొందరినయినా నేను గుర్తించ గలను.

చీకట్లు ముసురుతుండగా ఆ వీధిలోకి అడుగు పెట్టాను. బాల్యంలో నేను నడిచిన ఆ దారుల్లో మళ్లీ నడుస్తుంటే ఒళ్లంతా ఒక రకమైన గగుర్పాటుకు లోనవ సాగింది.

నాకు ఎదురైన కొందరు నన్ను వింతగా, కొత్తగా చూస్తున్నారు.

పూర్ణమ్మ ఇంటికి చేరువవుతున్న కొద్దీ ఏదో తపన, బాధ తన్నుకు రాసాగాయి. అదే చిన్న మిద్దె ఇల్లు. ఇంట్లో ఎవరో ఉన్నట్లున్నారు.

నేను ఇంటి ముందు నిల్చున్నాను. నా అలికిడికి బయటికి వచ్చిన ఆడ మనిషిని పరిశీలనగా చూశాను.

''ఎవరు గావాలన్నా?'' ఆమె బహుశా రాజు భార్యనుకున్నాను.

''రాజు వున్నాడా''

''లేడు, మీరేడికెళ్లి వచ్చింగ్రు. మిమ్ము నెన్నడు సూడలే'' ఆమె మాటలకు ఏం సమాధానం ఇవ్వాలో వెంటనే తోచలేదు.

''పూర్ణమ్మ ఇల్లు ఇదేకదా, పాతికేళ్ల క్రితం ఆ ఎదిరింట్లో వుండేవాళ్లం'' నన్నునేను పరిచయం చేసుకోవడం కష్టమవుతోంది.

''అత్త చచ్చిపోయింది గదన్నా''

''ఆ విషయం తెలిసే పలకరిద్దామని వచ్చాను. ఇక్కడ సాయమ్మ, బందెమ్మ, బాలమణీ... వాళ్లంతా ఉండేవాళ్లు కదా''

''వున్నరు, కూకోండ్రి. సాయత్తని పిల్చుకొస్త'' ఇంట్లోని చెక్క స్టూల్ తెచ్చి వాకిట్లో వేసింది. కూర్చోవాలనిపించలేదు. నిలబడే వుండి వేం ఒకప్పుడున్న ఇంటివైపు చూసేను. ఎవరో అద్దెకున్నట్లున్నారు.

నేను నిల్చున్న నేలపై పాతికేళ్ల క్రితం, చిరుపాదాలతో చిందులేస్తూ ఆటలాడిన ఈ వాకిట్లోనే కదా మమ్మల్ని కూర్చోబెట్టి చెట్టూ తిరుగుతూ గొబ్బెమ్మ పాటలు పాడింది పూర్ణమ్మ.

సాయమ్మని వెంటబెట్టుకొని వచ్చింది ఆమె.

''ఎవరు కొడుకా,'' ముసలితనంతో కొంత వణుకుతోంది. నాకు దగ్గరగా వచ్చి పరీక్షగా చూసింది.

''నేను సాయమ్మా, ఆ ఇంట్లో వుండేవాళ్లం కదా, మీతో అడవులకు వచ్చేవాణ్ణి. గుర్తులేదా,'' నా మాటకు ఆలోచనలో పడింది.

''ఔ! ఎన్నడో... నీవు సిన్నగ, గింతుటివి, పోలీసోళ్ల పిలగానివి గదా. లచ్మీ... మన రాజు దోస్తు. సిన్నగున్నంగ నీ అత్తెంబడే తిరుగుతుండె గీ పిలగాడు. ఎన్నేండ్లాయె కొడుకా... పెండ్లాయేనా? పిల్లలెంతమంది? అమ్మా నాయిన బావుండరా...'' ప్రేమగా పలకరించింది. సాయమ్మ.

''అంతా బాగున్నారు... పూర్ణమ్మ విషయం తెలిసి వచ్చాను.''

''గట్లనా... అయ్యో కొడుకా గంత దూరుకెల్లి మమ్ము సూశిపోదామని వచ్చినవా... పూర్ణమ్మ సచ్చిపాయె గద కొడుకా.''

''ఇట్లెందుకయ్యింది సాయమ్మా?

''రాజును బాగానే సద్వివిచ్చె. వోడు మంచిగనె వాచి కంపెన్ల సర్కారు కొలువు దొరికిపిచ్చుకున్నడు. లచ్చిమినిచ్చి పెండ్లి చేసె. లచ్మిది యావవూరనుకున్నవ్. దేవునిపాలెం కాడున్న గుడ్లనర్వ. ఇద్దరు ఆడివిల్లలు పుట్రి. పట్నంల మంచిగనె బతుకుతుండ్రి. పూర్ణమ్మ కొడుకు తానికి ఓతుండె, వస్తుండె... కన్న కష్టాలవడి రాజుగాన్ని సద్వివిచ్చెగద, సర్కారు కొలువయ్యిందని మస్తు కుషాలయ్యిండె... ఏమాయెనో, ఏమో కొడుకా, వుంటుంటనే పూర్ణమ్మకు పానం బాగలేకుంటాయె. గీడ పండ్లమ్ముడు మాన్పిచ్చి, కొడుకుతానికి పట్నం దోలి స్తిమి...'' సాయమ్మ చెబుతుండగా లక్ష్మి 'టీ' తీసుకొచ్చి నా చేతికిచ్చింది.

''అత్త మా వొద్దనే వుండెనన్నా. మా ఆయన ఇ.ఎస్.ఐ. కార్డు మీద దవఖాన్ల సూపిస్తుంటిమి. డాక్టర్లు గుండెకొచ్చిన రోగమనిరి. చాన కరీదైన మందులు రాస్తుండ్రి. గవన్నీ వోళ్లే ఇస్తుగ్రి. అవిటితోన జెరపానం బాగుండె. మా గాచ్చారానికి ఏమొచ్చెనో ఏమో... మా ఆయన పన్జేసే వాచీల కంపెనీకి శనిపట్టె అన్నా. యాడాది సంది జీతాలు సరిగ ఇయ్యకుంటయిగ్రు. ఇ.ఎస్.ఐ. వున్నంగ అత్తనండ్ల జూపినమ్. కంపెన్ల కొలువు చేయకుంటే గా దవఖాన్లకు రానీయరంట. కంపెనీ మూసి అర్నెల్లాయె. మూసినప్పుడిచ్చిన గా పైసలు అప్పులకే పాయె. గిట్ల నడిమిట్ల కొల్వులు దీసి, మమ్ము రోడ్లమీదికి నూకిరి. పిల్లలను కాన్వెంటుల ఏసిం టిమి. నెలనెల ఫీజులు గట్టకుంటె బడిలకు రానీయక పోయిరి. అత్త రోగం మల్ల మల్ల దిరగవడవట్టె. సర్కారు దవఖానకు కొండ వోయినం. గానీ, మందులు లేవాడ. పయివేట్ల సూపుతె వెయిలకు వెయిలడగ వట్టిగ్రు. గట్లనే అప్పులు చేసి తల్లికి సూపిచ్చె. సేతుల్ల పైసలేకుం

టాయె. వున్న కొలువూసిపాయె. కిరాయిలు గట్టకుంటె ఇంటోడూకుంటాడ. లొల్లివెట్టె. తిండి గింజెలు కొన రాకుంటాయె. పిల్లలను పస్తులు పండవెట్టబడ్తిమి. దినం గడుసుడు కష్టమయిపాయె అన్నా... దొంగలు దొంగలు ఊర్లు పంచక తిన్నట్లు ఎవడెవడు జతగట్టి కంపెన్ని దోస్కతినెనో...

" 'సర్కారు నౌకరో, సర్కారు నౌకరో అంటనిసస్తి సర్కారు నౌకర్ల మన్నువడ నడిమిట్ల నౌకరి దీసిరిగదనె ముండకొడుకులు. ఊర్లయాడ కష్టం జేస్కున్నా గింత బువ్వ దొరుకుతుండె. నీ బతుకెందుకిట్లాయె కొడుకా' అంట మా అత్త ఒకటే ఏడ్పుడు సూరు జేసె.

" 'అప్పులు దెచ్చి మందులు కొనకుంఢ్రి. నేను గిట్లనే సస్త. నాకోసురం అప్పుల పాలు గాకుంఢ్రి...' అత్తకు గిదే సింత. మా ఆయన కొలువు వోయినాంక మనుసుల్ల మనిసి గాకుంటయ్యిండన్నా. కనబడ్డ కంపెనీల కాడ్కి వోయిండు. నౌకరి యాడ లేదనిరి.

" 'ఒకసారి ఊర్కివోయొస్త. ఊరి మీన పానం గుంజుతుండద'ని మే మాలుమొగులం ఎంతగనం జెప్పిన ఇనకుంట కొడుకుతాన బస్సెక్కిపిచ్చుకొని వచ్చె అత్త. 'నా సేతుల తోన బస్సెక్కిపిచ్చి... మా అమ్మను సంపుకొంటిగదా,' అంట గీయన ఒకటే ఏడ్పుడు.

"పిల్లల సద్వు మాన్పిస్తిమి. మల్లగీ ఊర్కి తోలిచ్చిండు. పిచ్చోసీర్గ-పట్నంల గల్లి గల్లి దిరుక్కుంట ఏడున్నడో, ఏం దింటున్నడో... మా బత్కులుల్ల మన్ను వోసి, అగుడు జేసిరి గదన్న. నోటికాడి బుక్క గుంజిరి. మా వుసురుముట్ట... కడుపు గాల్తె తిట్టబుద్ధయితదన్నా..." చెప్పడం ఒక్కసారిగా ఆపింది లక్ష్మి. మళ్లీ ఏదో చెప్పబోతూ నోరు పెగలక బోరుమంది.

"ఎందుకేడుస్తవే పిచ్చిదానా, పుట్టిచ్చినోడు సంప్తడా? ఎట్లనన్న కాయకష్టం జేస్క బత్కలేమా, కాల్జేతులున్నంగ బయపడేదేమిటికి?" సాయమ్మ లక్ష్మిని ఊరడిస్తూనే నావైపు తిరిగింది.

"కొడుకా పూర్ణమ్మ గీ ఊరికి వచ్చింది మొదలు ఎవర్తోన మాటలే, ఒక ముచ్చటలే బువ్వవెడ్తే తినలే. కొడుకుతానికి మల్ల పట్నం బోనన్నది. వోని సర్కారు కొలువుదీసిరే... బతుకుల్ల ఇంగ్లం బోసిరే... అనుకుంట, ఏడ్సుకుంట వుండె. నాతిరి ఎన్నిగొట్టంగ లేసి బాయి కాడికి వోయిందో కొడుకా... తెల్లంజామున పూర్ణమ్మ గనవడకపోతే ఊరల్ల గాలిస్తిమి. మల్తదినం గీయాలప్పుడు కర్ణమోళ్లబాయిల పీనిగై దేలె."

"ఊర్లందరికి ఈత నేర్పి ఈదరాకుంట రెండు గాళ్లకు బండరాళ్లను గట్టుకున్నది కొడుకా... బలిమిసావు సచ్చె కొడుకా, గింత గాచ్చారం ఎందుకొచ్చెనో కొడుకా..." సాయమ్మలో జ్ఞాపకాల గనులు కరుగుతున్నాయి.

ఆమె దుఃఖాలాపన తీగలుగా సాగి నన్ను చుట్టుకుంటుండగా పూర్ణమ్మ చావుకు కారణం తెలిసింది.

***ఆదివారం ఆంధ్రజ్యోతి, 12 డిశంబరు 1999***

